# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు స్పష్టమైన లక్ష్మణరేఖ గీశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదాయార్జన శాఖలను ఆదేశించారు.**

3. **తెలంగాణలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు కొనుగోలు పై ఉచిత పన్నును అమలు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేరొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

5. **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.**

==========================

ఉగ్రవాదులను వారి స్థావరాలలోనే హతమార్చగలిగే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు. పంజాబ్‌లోని ఆదంపుర్ వైమానిక స్థావరాన్ని సందర్శించిన సందర్భంగా నిన్న జవాన్లను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ఆయన అభినందిస్తూ... భారతదేశం 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు స్పష్టమైన లక్ష్మణరేఖ గీశామని చెప్పారు. ఎవరైనా ఉగ్రదాడి చేస్తే భారత్ వారికి ధీటుగా జవాబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ....

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఉగ్రవాదాన్ని కట్టడి చేయడమే భారత్ ప్రాథమిక లక్ష్యమని విదేశాంగ శాఖ కార్యదర్శి రణదీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, జమ్మూకశ్మీర్ విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక చర్చలు మినహా ఎటువంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని రణదీర్ జైశ్వాల్ పేర్కొంటూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు గత 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదాయార్జన శాఖలను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పన్ను చెల్లింపుదారులకు సేవలందించేలా 3 నెలల్లో కృత్రిమ మేధ- ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఎలక్ట్రానిక్స్, ఐటీ సేవలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

అనంతరం ముఖ్యమంత్రి ఉద్యానశాఖపై సమీక్ష నిర్వహించారు. గోదావరి, కృష్ణా డెల్టాలు మినహా రాష్ట్రమంతటా ఉద్యాన సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని.. ఏడాదికి ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం ఆర్జించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

---------------------------

తిరుమలలో రేపటి నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలను అనుమతిస్తున్నామని వెల్లడించారు. వేసవి రద్దీ దృష్ట్యా ఈ నెల నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవల ప్రకటించింది. కాగా ఆ గడువును తగ్గించి ఈ నెల 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు కొనుగోలు పై 'ఉచిత పన్నును అమలు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఒక ఆటోమొబైల్ సంస్థకు చెందిన నూతన ఎలక్ట్రిక్ ఆటోలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పర్యావరణహితానికి విద్యుత్ వాహనాలు దోహదపడతాయన్నారు. హైదరాబాద్ నగరంలో 2 వేల 800 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్..27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు మౌలిక సదుపాయాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న మూడవ జాతీయ తైక్వాండో శిక్షణా సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. రాష్ట్ర ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ,

వాయిస్..21 సెకన్లు

---------------------------

హైదరాబాద్ వేదికగా జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీలలో భాగంగా నిన్న సాయంత్రం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించారు. అనంతరం లాడ్‌బజార్ మీదుగా చౌమొహల్లా ప్యాలెస్ వరకు నిర్వహించిన

హెరిటేజ్ వాక్‌లో 109 దేశాల పోటీదారులు పాల్గొన్నారు. తొలుత సుందరీమణులు చార్మినార్ వద్దకు చేరుకోగా అక్కడ ప్రత్యేక ఫొటోషూట్ నిర్వహించారు. అనంతరం వారు చార్మినార్‌ను వీక్షించడంతోపాటు నిర్మాణ నేపథ్యం తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం చుడీబజార్‌లో గాజులు, ముత్యాలహారాలు, ఇతర అలంకరణ వస్తువుల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

-----------------------------

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా వైద్య అధికారులతో దృశ్య మాధ్యమం విధానం ద్వారా ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాల మెరుగుదలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది బడ్జెట్ లో ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.

-----------------------------

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ దేశంలోకి ప్రవేశించాయని, దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులతో పాటు దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు భారత వాతారవరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రానున్న రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

=====================